సాక్షి నిర్మల్

ఆదివారం । 6 । ఆగస్టు । 2023



పల్లెకు చేరువయ్యేలా..!

ప్రయాణికులకు మరింత చేరువయ్యేలా టీఎస్ ఆర్టీసీ వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. పల్లె వెలుగు బస్సుల్లో ప్రాణికుల పెంపుపై దృష్టిసారించింది. 10లో▸

7న వ్యాసరచన పోటీలు

నిర్మల్ రూరల్: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈనెల 7న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో 9,10వ తరగతి చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. చేనేత వస్త్రాల ప్రాముఖ్యత-ప్రభుత్వ కృషి అనే అంశంపై ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని సోఫీ నగర్ రెసిడెన్షియల్ పాఠశాలలో వ్యాసరచన పోటీ ఉంటుందని వివరించారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారిని 9440069830 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
31.3 /24.8

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉండి ఉక్కపోతగా అనిపిస్తుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాధ్యతలు చేపట్టిన భైంసా ఆర్డీవో



ఆర్డీవో కోమల్‌రెడ్డి

భైంసాటౌన్: భైంసా ఆర్డీవోగా కోమల్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు పనిచేసిన రవికుమార్ ఎన్నికల బదిలీల్లో భాగంగా మహబూబ్‌నగర్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో హుజూరాబాద్ నుంచి బదిలీపై వచ్చిన కోమల్ రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

డిపోను లాభాల్లోకి తేవాలి



నగదు ప్రోత్సాహం అందిస్తున్న ఈడీ వినోద్

భైంసాటౌన్: ఆర్టీసీ భైంసా డిపోను లాభాల బాటలోకి తీసుకురావాలని కరీంనగర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్ అన్నారు. భైంసా డిపోను శనివారం సందర్శించారు. ఉద్యోగులు, సిబ్బందితో మాట్లాడారు. ప్రస్తుతమున్న సమస్యలను అధిగమించి, ఈపీకేను పెంచడం ద్వారా డిపోను లాభాల్లోకి తీసుకురావచ్చన్నారు. ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. ఇటీవల వరదలకు డిపో నీట మునిగిన నేపథ్యంలో మరోమారు అలాంటి ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని డీఎం అమృతకు సూచించారు. జూలైలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్లు భోజన్న, గంగాధర్, శ్రీనివాస్, సరిత, సంపత్, ఉత్తమ కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్ శంకర్, సిద్దిక్, సుభాష్‌కు నగదు ప్రోత్సాహం అందజేశారు. ఆయన వెంట ఆర్‌ఎం సాలోమన్, డిప్యూటీ ఆర్‌ఎం సురేశ్ చౌహాన్ ఉన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా



నిర్మల్ డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

నిర్మల్‌టౌన్: టీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లుకు రాష్ట్ర గవర్నర్ తమిళిసై వెంటనే ఆమోదం తెలపాలని జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదుట ఉద్యోగులు శనివారం ధర్నా చేశారు. ఉదయం బస్సులు నిలిపివేసి, డిపో ప్రధాన ద్వారం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల జీవితంలో వెలుగులు నింపాలని ప్రభుత్వం విలీనం చేస్తే గవర్నర్ బిల్లును ఆమోదించకపోవడం సరికాదన్నారు.ఉద్యోగులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: భైంసా డిపో ఎదుట కూడా ఉద్యోగులు రెండు గంటలపాటు నిరసన తెలిపారు. బిల్లును వెంటనే ఆమోదించాలని కోరారు.

వ్యాధుల నియంత్రణకు చర్యలు

నిర్మల్‌చైన్‌గేట్: సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్యాధికారి ధనరాజ్ తెలిపారు. వర్షాల కారణంగా దోమలు వృద్ధిచెంది మలేరియా డెంగీ ప్రబలే అవకాశం ఉందన్నారు. వాటిని నియంత్రించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రతీ మండలానికి ఒక జిల్లా స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగించామన్నారు. ప్రతీ మండలంలో ఒక టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మున్సిపల్, పంచాయతీ రాజ్, రెవెన్యూ, ఆరోగ్య, మహిళ శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జిల్లాలో 478 బృందాలతో వారంలో రెండు రోజులు డ్రైడే, జ్వర సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. అధికంగా వ్యాధులు నమోదు అయిన గ్రామాల్లో, పట్టణాల్లో ప్రత్యేకమైన ఆరోగ్య శిబిరాలు నిర్వహించి చికిత్స అందిస్తున్నామని, నియంత్రణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పాఠశాలలు వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఆర్‌బీఎస్‌కే బృందాలతో విద్యార్థులకు చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

దుకాణాల తొలగింపు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో అక్రమంగా రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటుచేసిన షెడ్లు, తోపుడు బండ్లను ట్రాఫిక్ పోలీసులు శనివారం తొలగించారు. దీంతో చిరువ్యాపారులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ అక్కడికి చేరుకుని సర్ది చెప్పి, దుకాణాలను తొలగించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎస్పీ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు రోడ్ల పక్కన వేసిన షెడ్లను, తోపుడు బండ్లను తొలగించామన్నారు. పట్టణంలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, మంచిర్యాల చౌరస్తా, ఈద్గా చౌరస్తాలో అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్లు, తోపుడు బండ్లతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని తెలిపారు. అనుమతి లేకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దోస్త్.. మేరా దోస్త్..

నిర్మల్ ఖిల్లా: చుట్టూ గాఢాంధకారం అలుముకున్నప్పుడు, నిరాశా నిస్పృహలు చుట్టుముట్టినప్పుడు.. నీ కోసం నేనున్నాను.. అంటూ భుజం తట్టే ఆత్మీయమైన స్పర్శ స్నేహం. బాధను సగానికి తగ్గించి.. ఆనందాన్ని రెట్టింపు చేసేది నిజమైన స్నేహం. మానవ సంబంధాలన్నీ ఆర్థిక బంధాలుగా మారిపోయి, మనిషన్నవాడు మాయమైపోతున్న తరుణంలో ఇంకా ఎక్కడో ఒక చోట ఆత్మీయమైన స్నేహాలు, ఉన్నతమైన మానవతా విలువలు వెలుగు రేఖలుగా దారి చూపుతున్నాయి. యాంత్రిక జీవనంతో ఉరుకులు, పరుగులతో కాలం వెళ్లదీస్తున్న చాలామందికి ఊరటనిచ్చే అంశం.. చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం. అపూర్వ సమ్మేళనాలు విరివిగా నిర్వహించడం, దూరమైన స్నేహితుల అంతరంగాన్ని స్పృశించేందుకే అన్నది నిర్వివాదాంశం. పని ఒత్తిడితో సతమతమైనా, కుటుంబ బాధ్యతలతో భవిష్యత్తు పై భయం వేసినా ఉపశమనం కలిగిస్తున్నది ఫేస్‌బుక్, వాట్సాప్ లాంటి ప్రచార మాధ్యమాల్లో ఆత్మీయ మిత్రుల సందేశాలే. కలిమిలేముల్లో నేనున్నాను అనే విశ్వాసం ప్రకటించే మిత్రులను సంపాదించుకున్న వాళ్లు నిజంగా ధన్యులు. నేడు ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆప్త మిత్రులు.. చిన్ననాటి నుంచి కలిసే ప్రయాణం చేస్తున్న ఆత్మీయ స్నేహితులు.. పేదరికం నుంచి ఉన్నతంగా ఎదిగిన మిత్రులపై ప్రత్యేక కథనాలు..



కలిసి సాగుతూ.. ఉపాధినిస్తూ..



నిర్మల్‌లోని తమ ఇండస్ట్రీలో సిబ్బందితో కార్తీక్, రాహుల్

నిర్మల్: నిర్మల్‌కు చెందిన కార్తీక్, రాహుల్ ఇద్దరూ మంచి మిత్రులు. బీటెక్ చదివారు. కార్తీక్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేయగా, రాహుల్ ఎంబీఏ కూడా పూర్తిచేశారు. ఎక్కడో.. ఎవరి దగ్గరో పనిచేయడం ఏంటని ఆలోచించారు. సొంతూరిలోనే సరికొత్త ఆలోచనతో ముందడుగేశారు. జిల్లా కేంద్రంలోనే యూపీవీసీ కిటికీలు, డోర్లు తయారుచేసే పరిశ్రమను పెట్టారు. ముందుగా చిన్నగా ప్రారంభించారు. మార్కెట్‌లో కష్టనష్టాలు తెలుసుకుంటూ క్రమంగా పనితీరును మెరుగుపర్చుకుంటూ స్వల్పకాలంలోనే ఉత్తమస్థాయికి ఎదిగారు.

ఉపాధినిచ్చే స్థాయికి..

తాము ఒకరి దగ్గర చేస్తే తమ జీవితాలు మాత్రమే బాగుపడతాయి. అదే మనం ఒక పనిని మొదలుపెడితే మరికొందరికి ఉపాధినివ్వొచ్చన్న ఆలోచనతో రాహుల్, కార్తీక్ కలిసి ప్రారంభించారు. వారి ఆలోచనలకు తగ్గట్లు ప్రస్తుతం 24 మందికి యూపీవీసీ పరిశ్రమ ద్వారా ఈ స్నేహితులు ఉపాధినిస్తున్నారు. కరోనా కష్టకాలంలోనూ తమ సిబ్బందికి సాయమందించారు. నిత్యం పనిలో బిజీగా ఉంటూ చిన్నవయసులోనే పెద్దబాధ్యతలు మోస్తూ.. సామాజిక సేవలోనూ ఈ మిత్రులు భాగమవుతున్నారు. దహెగాం మండలంలో తల్లిదండ్రులు లేని నలుగురు పిల్లలకు తమవంతుగా నిర్మల్ నుంచి ఆర్థికసాయాన్ని పంపించారు. వీరి పనితీరుకు అవార్డులు, ప్రశంసలజల్లు కూడా కురుస్తూనే ఉంది. కేంద్రం చేపట్టిన ఆజాదికాఅమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఎంఎస్ఎంఈలో తెలంగాణ బెస్ట్ ఇండస్ట్రీల్లో ఈ మిత్రుల పరిశ్రమ కూడా నిలిచింది. అలాగే తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లోనూ ఉత్తమ అవార్డును కలెక్టర్ వరుణ్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.

కలిసే నిర్ణయిస్తాం..



మేమిద్దరం కలిసే నిర్ణయాలు తీసుకుంటాం. ఏ పని ఉన్నా సమష్టిగా ముందుకు సాగుతాం. ఏదైనా కొత్తగా, పదిమందికి ఉపాధినిచ్చేలా ఉండాలన్న ఆలోచనతో యూపీవీసీ పరిశ్రమ పెట్టాం. అందరి సహకారంతో ముందుకు సాగుతున్నాం. మనం చేసే ఆలోచనలతోనే మన స్నేహం బలంగా తయారవుతుందని నమ్ముతాం.

– కార్తీక్, రాహుల్, నిర్మల్

'కడెం'ను కాపాడిన మిత్రులు



గేట్లు ఎత్తిన మిత్రబృందం

కడెం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. ఒక దశలో గేట్లు తెరుచుకోకపోవడంతో ప్రాజెక్టు తెగిపోయే పరిస్థితి ఏర్పడింది. అధికారులు కూడా ఏమీ చేయలేని నిస్సహాయులుగా మారిపోయారు. ఈ సమయంలో ప్రాజెక్టు వద్దనే ఉన్న ఓ యువకుడు కడెం గ్రామానికి చెందిన తన మిత్రులకు సమాచారం అందించాడు. వెంటనే అప్రమత్తమైన మిత్రులు ఆ సమాచారాన్ని మిగతా వారికి కూడా అందించారు. అంతా కలిసి నిమిషాల వ్యవధిలో డ్యాంపైకి చేరుకున్నారు. 3.5 లక్షల వరద పోటెత్తుతున్నా.. అదరకుండా.. బెదరకుండా.. ప్రాజెక్టును కాపాడేందుకు ధైర్యంగా ప్రాజెక్టు గేట్ల హ్యాండిల్ తిప్పుతూ మాన్యువల్‌గా గేట్లు ఎత్తారు. ప్రాజెక్టుకు ప్రమాదం తప్పించారు. ఊరి కోసం, ప్రాజెక్టు కోసం చేయి చేయి కలిపిన మిత్రుల ధైర్యాన్ని అందరూ ప్రశంసించారు.

ప్రమాదం ఉందని వెళ్లాం



కడెం ప్రాజెక్టుకు భారీగా ఇన్‌ఫ్లో వస్తుందని, గేట్లు తెరుచుకోవడం లేదని మిత్రుడు రాము కాల్ చేశాడు. నేను ఇంకా కొందరు మిత్రులం కలిసి డ్యాం మీదకు వెళ్లాం. మోటార్లు చెడిపోవడంతో అధికారులకు ఏం చేయాలో అర్థంకాని పరిస్థితిలో ఉన్నారు. మిత్రులమంతా బ్యాచ్‌ల వారీగా హ్యాండిల్ తిప్పుతూ గేట్లను ఎత్తాం.– సురేందర్, కడెం

మాన్యువల్‌గా ఎత్తాం



భారీ వరదలతో కడెం ప్రాజెక్టు గేట్లు మొరాయించాయని మిత్రుడు తెలిపాడు. చేతనైనా సాయం చేద్దామని ప్రాజెక్టు వద్దకు వెళ్లాం. ప్రాజెక్టు తెగిపోతుందేమో అని అప్పటికే అధికారులు చర్చించుకుంటున్నారు. దిగువన ఉన్నవారు ఆందోళన చెందుతున్నారు. ఏదైతే అదైతదని స్నేహితులందరం కలిసి వరద గేట్లను హ్యాండిల్ తిప్పుతూ మాన్యువల్‌గా ఎత్తాం. – వాజిద్‌ఖాన్, కడెం

మా శ్రమ ఫలించింది..



కడెం ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద వస్తుందని తెలుసుకుని చూద్దామని వెళ్లాను. అదే సమయంలో గేట్లు తెరుచుకోవడం లేదని అధికారులు అనుకుంటున్నారు. మాన్యువల్‌గా ఎత్తేందుకు ప్రయత్నిస్తున్నారు. వెంటనే ఊళ్లో ఉన్న మిత్రుడు సురేందర్‌కు ఫోన్‌చేసి ఫ్రెండ్స్‌ను తీసుకుని కట్టపైకి రావాలని ఫోన్ చేశాను. నిమిషాల్లో పది మంది వచ్చారు. అందరం కలిసి హ్యాండిల్ తిప్పుతూ గేట్లు ఎత్తాం. మా శ్రమ ఫలించింది. – రాము, కడెం

పేదరికం నుంచి పెద్ద ఉద్యోగాలకు..



అధ్యాపక స్థానాల్లో ఉన్న ముగ్గురు మిత్రులు వీరే..

నిర్మల్‌ఖిల్లా: ఇంటర్‌లో ముగ్గురి మధ్య ఏర్పడిన మైత్రి బంధం బలపడింది. ఆ బంధం దృఢపడుతూ వస్తోంది. పరస్పర సహకారం.. ప్రోత్సాహం ఇప్పుడు ముగ్గురినీ ఉన్నత స్థానాల్లో నిలిపింది. జిల్లా కేంద్రానికి చెందిన కటకం మురళి, యు.రవికుమార్, కందూరి శంకర్ మిత్రులు. 16 ఏళ్ల వయసులో తాము ఇంటర్ చదువుతున్న కాలంలో పరిచయం ఏర్పరచుకున్నారు. దిగువ మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన వీరుఇంటర్, డిగ్రీ, పీజీ స్థాయిలో అనేక ఒడిదుడుకులను తట్టుకొని ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. అక్కడితో ఆగకుండా సలహాలు, సూచనలు తీసుకుంటూ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రిన్సిపాల్ స్థాయికి ఎదిగారు.

యువతకు స్ఫూర్తినిస్తూ..

కటకం మురళి స్వగ్రామం లక్ష్మణచాంద మండలం పార్‌పల్లి. రవికుమార్ మామడ మండలం పోన్‌కల్ గ్రామానికి చెందినవాడు. కందూరి శంకర్ సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన వ్యక్తి. ఈ ముగ్గురు నిర్మల్ జిల్లాకేంద్రంలో ఇంటర్మీడియట్‌లో కలిసి చదువుకున్నారు. తర్వాత డిగ్రీ, పీజీలు, ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసుకుని ప్రభుత్వ ఉపాధ్యాయులుగా కొలువులు సాధించారు. ప్రస్తుతం మురళి, రవికుమార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా విధులు నిర్వహిస్తుండగా, శంకర్ దిలావర్పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నాడు. ముగ్గురూ బోధనారంగంలో బాధ్యతలు నిర్వహిస్తూనే, ఉద్యోగ, పోటీ పరీక్షలకు విషయ నిపుణులుగా వ్యవహరిస్తున్నారు. నిరుద్యోగులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ సలహాలు సూచనలు అందిస్తున్నారు. వీరి మైత్రి యువతకు స్ఫూర్తినిస్తుంది.

కష్టసుఖాల్లో తోడుంటాం...

మేము ముగ్గురం ఇంటర్ చదువుతున్నప్పుడు ఆలోచనలు కలిసి మిత్రులయ్యాం. జీవితంలో వేరువేరు బాటల్లో సాగినా.. ముగ్గురం బోధన వృత్తిలోకి వచ్చేశాం. మొదట ప్రభుత్వ ఉపాధ్యాయులుగా నియమితులయ్యాం. తర్వాత మరింత కష్టపడి చదివి జూనియర్, లెక్చరర్ డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాలను పొందాం. ప్రస్తుతం మాలో ఇద్దరం అసిస్టెంట్ ప్రొఫెసర్లం. ఒకరు ప్రిన్సిపాల్. ఆర్థిక, సామాజిక ఒడిదుడుకుల్లోనూ కుంగిపోలేదు. సమస్యలు ఎదురైనప్పుడు ముగ్గురం కలిసికట్టుగా ఉండి నిర్ణయాలు తీసుకుంటాం. అభిప్రాయాలను పంచుకుంటాం. – కటకం మురళి, రవికుమార్, కందూరు శంకర్

పారదర్శకంగా ప్రభుత్వ వైద్యం

- ప్రిస్క్రిప్షన్లపై క్యూఆర్‌కోడ్
- ఎక్కడికి వెళ్లినా తెలిసేలా ఆన్‌లైన్‌లో వివరాలు



క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తున్న వైద్యుడు

నిర్మల్‌చైన్‌గేట్: సర్కారు ఆస్పత్రులకు పేషెంట్లు తక్కువగా వచ్చినా.. ఎక్కువ సంఖ్యలో వచ్చినట్లు చూపించే పద్ధతికి స్వస్తి పలుకుతూ.. ఓపీ సేవల్లో ప్రభుత్వం పారదర్శకతను పెంచింది. వైద్యులు కూడా మొక్కుబడి సేవలకు పరిమితం కాకుండా నాణ్యమైన వైద్యం అందించేలా వారి పనితీరును పర్యవేక్షించేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచింది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఏ వైద్యుడి దగ్గర ఏ ట్రీట్‌మెంట్ తీసుకున్నారో తెలిసిపోతుంది.

'కార్పొరేట్'కు దీటుగా..

ప్రజారోగ్య సేవలను మరింత సరళతరం చేసేందుకు ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటోంది. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య విధానపరిషత్‌లోని ప్రభుత్వ ఏరియా, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఔట్ పేషెంట్ల చిట్టీ(కార్డు)లకు క్యూఆర్ కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. తొలుత ఏరియా ఆస్పత్రుల్లో ఈ నూతన పద్ధతిని అమలు చేయడం ఆరంభించారు.

ఏం చేస్తారంటే..

ఓపీ చిట్టీకి ప్రత్యేక కోడ్ నంబర్ కేటాయించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రోగులకు సంబంధించిన బయోడేటా, రోగనిర్ధారణ, ట్రీట్‌మెంట్, వాడే మందుల వివరాలన్నీ టీఎస్ఈఎంఐఎస్ డేటా స్టోర్‌కు వెళ్తాయి. కంప్యూటర్‌లో పేరు, వివరాలు నమోదు చేసి ప్రింటెడ్ చిట్టీ ఇస్తారు. దీనిని తీసుకుని డాక్టర్ వద్దకు వెళ్లగానే చిట్టీపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను తన మొబైల్‌తో టీఎస్ఈ హెచ్ఎంఐఎస్ (తెలంగాణ స్టేట్ ఎలక్ట్రానిక్ హెల్త్ మేనేజ్మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం)కి అనుసంధానం చేస్తారు. రోగికి ఏమైనా వైద్య పరీక్షలు అవసరమైతే చేయించి.. ఆ పరీక్షల ఫలితాల వివరాల ఆధారంగా మందులు రాస్తారు. రాసిన మందుల ప్రిస్క్రిప్షన్‌ను కూడా ఫోన్‌లో ఫొటో తీసి టీఎస్ఈ హెచ్ఎంఐఎస్‌కి అప్‌లోడ్ చేస్తారు. ఇలా ప్రతీ వైద్యుడు పేషెంట్ల ఓపీ చిట్టీలతో అందించిన వైద్య సేవలను ఆన్‌లైన్‌లో అనుసంధానం చేయడంతో చిట్టీ నంబర్ చెప్పగానే టీఎస్ఈ హెచ్ఎంఐఎస్ యాప్‌లో రోగి పొందిన వైద్య సేవలు కనిపిస్తాయి. ఇలా ఎక్కడ ఏరియా ఆస్పత్రికి వెళ్లినా గతంలో తాను పొందిన వైద్య సేవల మందుల చిట్టీ లేకపోయినా.. నంబరు ఆన్‌లైన్‌లో నమోదు చేయగానే వివరాలు తెలిసేలా ఆధునికీకరించారు.

మూడు ఆస్పత్రుల్లో అమలు..

జిల్లాలోని మూడు ఆస్పత్రుల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తెచ్చారు. జిల్లా ఏరియా ఆస్పత్రి, జిల్లా ప్రసూతి ఆస్పత్రి, భైంసా ఏరియా ఆస్పత్రి, ఖానాపూర్, నర్సాపూర్, ముధోల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు వైద్య విధానపరిషత్ పరిధిలో ఉన్నాయి. వీటిలో జిల్లా ఆస్పత్రులతోపాటు భైంసా ఏరియా ఆస్పత్రిలో ఆధునిక సేవలను అమలు చేస్తున్నారు. కాగా ఓపీ చిట్టీలను కంప్యూటర్‌లో నమోదు చేసేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించకపోవటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

వైద్యసేవలు పారదర్శకంగా..



ఏరియా ఆస్పత్రుల్లో ఆధునిక పద్ధతిలో కార్పొరేట్‌కు దీటుగా వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఓపీ సేవలను కంప్యూటరీకరించింది. అన్ని వైద్య విధానపరిషత్ ఆస్పత్రుల్లో ఈ విధానం అమలుకు శ్రీకారం చుట్టింది. నాణ్యమైన వైద్యం అందుతుండడంతోపాటు వైద్య సేవలపై పారదర్శకత పెరుగుతుంది.

– డాక్టర్ దేవేందర్‌రెడ్డి, జిల్లా ఆసుపత్రుల పర్యవేక్షకులు

పొనికి వనంతో కొయ్యబొమ్మలకు ఊతం

- డీఆర్డీవో విజయలక్ష్మి



పొనికి మొక్క నాటుతున్న విజయలక్ష్మి

సారంగపూర్: పొనికి వనం ఏర్పాటుతో కొయ్య బొమ్మల పరిశ్రమకు ముడిసరుకు కొరతతీరి పరిశ్రమకు ఊతంగా మారుతుందని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. మండలంలోని గోపాల్‌పేట్ శివారులోని మహబూబ్ ఘాట్స్ సమీపంలో ఏర్పాటు చేసిన పొనికి వనంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. 5 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 2 వేల మొక్కలు నాటుతున్నామని తెలిపారు. ప్రభుత్వం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టి కొయ్య బొమ్మల కళాకారులకు ఉపాధితోపాటు కర్ర అందుబాటులోకి తీసుకువస్తుందని పేర్కొన్నారు. మూడేళ్లలో మొక్కలు ఏపుగా ఎదిగి ఉపయోగంలోకి వస్తాయన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా బోరుబావి వేయించి మొక్కల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో గోపాల్‌పేట్ సర్పంచ్ సల్ల లింగవ్వ, అర్కాయితండా సర్పంచ్ రామారావు, ఏపీవో లక్ష్మారెడ్డి, టీఏలు లక్ష్మీకాంత్, రజిత, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రఫీ, ఎఫ్ఏ చంద్రకళ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓపీఎస్ సాధనకు అలుపెరుగని పోరాటం



నినాదాలు చేస్తున్న కృష్ణారావు, ఉపాధ్యాయులు

నిర్మల్ రూరల్/లోకేశ్వరం: ఉద్యోగులు, ఉపాధ్యాయుల పాత పెన్షన్ సాధన కోసం అలుపులేని పోరాటం చేస్తామని టీఎస్‌సీపీఎస్ ఈయు జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు అన్నారు. జిల్లా కేంద్రం, లోకేశ్వరం ఎమ్మార్సీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమంలో వేర్వేరుగా మాట్లాడారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 12న 'చలో హైదరాబాద్' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓపీఎస్ సాధనకు ఇటీవలే సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ చేపట్టిన రాష్ట్ర వ్యాప్త రథయాత్రకు మంచి రెస్పాన్స్ వచ్చిందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ పోరాటాలు చేసి ఓపీఎస్ సాధించుకుంటామన్నారు. ఇప్పటికే ఐదు రాష్ట్రాలు సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ అమలు చేస్తున్నాయని తెలిపారు. ఈనెల 12న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.సహాధ్యక్షుడు రేవంత్, ప్రవీణ్, కేపీ.రెడ్డి, చుక్క సాయి కృష్ణ, సాయికుమార్, రాజన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

డేద్రలో హెల్త్ క్యాంపు



వైద్య పరీక్షలు చేస్తున్న మెడికల్ అధికారి

సాక్షి స్పందన

బజార్‌హత్నూర్: మండలంలోని డేద్ర గ్రామానికి చెందిన మూడేళ్ల గిరిజన బాలుడు పంద్ర పరుశురాం వైద్యం అందక మృతి చెందగా ఈ ఘటనను సాక్షిలో 'బురద రోడ్లు.. ఆపై వైద్యులు లేరు' అనే కథనం రావడంతో స్పందించిన వైద్య సిబ్బంది మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ భీంరావ్ ఆధ్వర్యంలో శనివారం డేద్ర గ్రామంలో హెల్త్‌క్యాంపు నిర్వహించారు. 30 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో సూర్యప్రకాష్, సూపర్‌వైజర్ దేవిదాస్, భాస్కర్‌రావ్, హెల్త్‌అసిస్టెంట్ గాజులు రమేష్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

చుక్కలదుప్పి మృతి



దుప్పి కళేబరం

ఖానాపూర్: మండలంలోని ఎర్వచింతల్ అటవీ ప్రాంతంలో శనివారం కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతిచెందిందని ఎఫ్ఆర్‌వో వినాయక్ తెలిపారు. గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ఊర కుక్కలు వెంబడించి దాడి చేయడంతో దుప్పి తీవ్రంగా గాయపడింది. దీంతో ఎఫ్‌బీవో నారాయణ, సిబ్బంది ప్రథమ చికిత్స అందించి ఖానాపూర్ తరలించే క్రమంలో మృతి చెందింది. అనంతరం దుప్పిని అక్కడే ఖననం చేశారు.

పాముకాటుకు ఎద్దు మృతి

సిరికొండ: పాము కాటుకు ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన రైతు అజ్జర్‌కు చెందిన ఎద్దు శనివారం చేనులో పనిచేస్తుండగా పాము కాటుకు గురైంది. వెంటనే వైద్యులను పిలిచి వైద్యం చేపించినా ఫలితం కానరాలేదు. దాని విలువ రూ.40వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు.

పల్లెకు చేరువయ్యేలా..!



పల్లెటూరుతో ఆర్టీసీ బస్సుది విడదీయరాని అనుబంధం.. ఒకప్పుడు ఎర్ర బస్సు కనిపిస్తే చాలు.. తమ ఇంటికి బంధువులు వచ్చారేమో.. అని కేరింతలు కొడుతూ.. దాని చుట్టూ చిన్నారులు కలియదిరిగేవారు. బస్సు ఊరిలో హాల్టింగ్ చేస్తే డ్రైవర్, కండక్టర్లను తమ సొంత ఇంటి మనుషుల్లా భావించి గ్రామస్తులు మర్యాద చేసేవారు.. ఇలా ఒకటేమిటి.. ఎన్నో జ్ఞాపకాలు.. ఆర్టీసీ ఆర్థికంగా వెలగడానికి గ్రామీణ ప్రాంతాలకు నడిచే పల్లె వెలుగు బస్సుల పాత్ర ఎంతో కీలకం.. అలాంటి పల్లెటూర్లకు ఆర్టీసీని మరింతగా చేరువ చేసేలా సంస్థ ఉన్నతాధికారులు పలు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

- గ్రామీణ ప్రయాణికులే ఆర్టీసీ లక్ష్యం
- వినూత్న స్కీంలు, సబ్సిడీ ప్రకటనలు
- ఆదాయార్జనే ధ్యేయంగా టీఎస్ ఆర్టీసీ



విలేజ్ బస్సు అధికారులకు శిక్షణ ఇస్తున్న ఆర్ఎం

ఆదిలాబాద్: ప్రయాణికులకు మరింత చేరువయ్యేలా టీఎస్ ఆర్టీసీ వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. శుభకార్యాలు, పండుగలు, ప్రత్యేక సమయాల్లో పలు ఆకర్షణీయమైన పథకాలతో ప్యాసింజర్స్‌కు దగ్గరవుతూనే రాయితీలను ప్రకటిస్తూ ఆకట్టుకుంటోంది. ఆర్టీసీలో ఎక్స్‌ప్రెస్ సర్వీసుల కన్నా పల్లె వెలుగు బస్సులే అధికంగా నడుస్తుంటా యి. పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించే వారిని ఆకర్షించడమే ధ్యేయంగా అధికారులు ప్రణాళిక బద్ధంగా ముందుకుసాగుతున్నారు. ప్రస్తుతం టీ–9, టీ 9–30 టికెట్ల పేరుతో కొత్త పథకాలను ప్రవేశపెట్టి సంస్థ ఆదాయాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఆర్థిక భారం తగ్గించేలా..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రయాణికుల సౌకర్యార్థం టీ–24 టికెట్ సర్వీసును ఆర్టీసీ అందుబాటులోకి తీసుకువచ్చింది. టీ–24 టికెట్‌ను రూ.100తో కొనుగోలు చేసి నగర పరిధిలో 24 గంటలపాటు పాటు ప్రయాణం చేయవచ్చు. హైదరాబాద్ నగర ప్రయాణికుల నుంచి ఈ టికెట్ సేవలకు భారీ స్పందన లభించింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ టీ–24 లాగా టీ9–60 టికెట్ సర్వీస్‌ను పల్లెవెలుగు బస్సుల్లో ఆర్టీసీ ప్రవేశపెట్టింది. టీ 9–60 టికెట్‌కు రూ.100 నిర్ణయించారు.

అంతర్రాష్ట్ర సర్వీసులకూ..

ఇక టీ9–60, టీ9–30 టికెట్లను పల్లెవెలుగు బస్సు కండక్టర్ల వద్ద తీసుకోవచ్చు. ప్రతిరోజూ సాయంత్రం 6గంటల వరకు ఈ టికెట్లు తీసుకునే అవకాశం కల్పించారు. 30 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఇతర రాష్ట్రాలకు కూడా ఈ టికెట్ సర్వీస్ వర్తిస్తుంది. టీ9–30 టికెట్ సర్వీస్ జూలై 27వ తేదీన ప్రారంభించగా నెలపాటు అందుబాటులో ఉంచి ప్రయాణికుల స్పందన అనుసరించి, సర్వీస్ గడువును పెంచాలని ఆర్టీసీ ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

పథకాలు వివరిస్తూ..

పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణించే గ్రామీణ ప్రాంత ప్రజలే ఆర్టీసీకి ప్రధాన ఆదాయవనరు. సాధారణంగా ప్రతీ గ్రామం నుంచి మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలకు ప్రజలు వివిధ పనుల కోసం వస్తుంటారు. ఈ నేపథ్యంలో రహదారి సౌకర్యం ఉన్న ఆయా గ్రామాలకు ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులను నడుపుతోంది. వారిని ఆకట్టుకునేలా పలు పథకాలనూ అమలు చేస్తోంది. ఈ సమాచారాన్ని గ్రామీణ ప్రాంత ప్రయాణికులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలనే ఉద్దేశంతో విలేజ్ బస్ ఆఫీసర్ వ్యవస్థను ఇటీవల ఆర్టీసీ ఏర్పాటు చేసింది.

30కిలో మీటర్ల దూరంలో..

ఇక ఈ టీ9–60 టికెట్‌ను ప్రయాణికులు ఆదరించడంతో సేవలు అమాంతం పెరిగాయి. పల్లెవెలుగు బస్సుల్లో 30 కిలోమీటర్ల పరిధిలో స్వల్పదూరం ప్రయాణించే వారి కోసం ఈ రాయితీ పథకాన్ని ప్రకటించింది. రూ.50 చెల్లించి ఈ టికెట్ తీసుకున్న వారు 30 కిలోమీటర్ల పరిధిలో పల్లె వెలుగు బస్సులు ఉదయం తొమ్మిది నుంచి రాత్రి 9 గంటల వరకు రానుపోను ప్రయాణించవచ్చు. దీంతో ప్రయాణికులకు రూ.10 నుంచి రూ.30 వరకు ఆదా అవుతున్నాయి. ఇక టీ9–30 టికెట్ తీసుకున్న వారు తిరుగు ప్రయాణంలో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించాలనుకుంటే రూ.20 కాంబీ టికెట్ తీసుకునే సదుపాయాన్ని కల్పించింది.



టీ 9-60, టీ 9-30 బస్సు టికెట్ల పోస్టర్

మెరుగైన సేవలందించేందుకు కృషి



ఆర్టీసీ సేవలను క్షేత్రస్థాయిలో ప్రయాణికులకు తెలియజేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ఇందుకు ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. గేట్ మీటింగ్, ప్రత్యేక సమావేశాల ద్వారా సేవలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తున్నాం. టీ 9–60, టీ9–30 టికెట్లను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి. ఆర్టీసీ ద్వారా మరింత మెరుగైన సేవలు అందజేయడానికి కృషి చేస్తున్నాం.

– సోలోమన్, ఆర్టీసీ ఆర్ఎం, ఆదిలాబాద్

బాధ్యతలు స్వీకరించిన ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి



రమణమూర్తి

ఆదిలాబాద్‌టౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఏసీబీ డీఎస్పీగా రమణమూర్తి శనివారం బాధ్యతలను స్వీకరించారు. 1996 ఎస్సై బ్యాచ్‌కి చెందిన ఆయన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని తిర్యాని, ఉట్నూర్, జైపూర్, నెన్నెల, హజీపూర్, లక్సెట్టిపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించారు. సీఐగా పదోన్నతి తర్వాత ఇన్‌స్పెక్టర్ ఏసీబీగా కరీంనగర్ రేంజ్ (ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా)లోనూ, కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో, ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన, ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ సర్కిల్‌లోనూ సీఐగా పనిచేశారు. ప్రస్తుతం ట్రాన్స్‌కో విజిలెన్స్ విభాగంలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఆయన ఇటీవల డీఎస్పీగా పదోన్నతి పొందారు.

ఇంకుడుగుంతలు పరిశీలించిన ఢిల్లీ బృందం



గుంతలు పరిశీలిస్తున్న అధికారులు

బోథ్: మండలంలోని పొచ్చర గ్రామంలో ఢిల్లీ నుంచి వచ్చిన అధికారుల బృందం శనివారం పర్యటించారు. మరుగుదొడ్లు, సెగ్రిగేషన్ షెడ్లు, ఇంకుడు గుంతలు, మురికి కాలువలను పరిశీలించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలను సందర్శించారు. పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులతో మాట్లాడారు. వారి వెంట పీడీ కిషన్, ఎంపీడీవో సుశీల్‌రెడ్డి, ఏపీవో జగ్గేరావ్ ఉన్నారు.

బస్సును ఢీకొన్న కంటైనర్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్‌లో శనివారం తెల్లవారుజామున ప్రైవేటు బస్సును కంటైనర్ ఢీకొన్న ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ నుంచి నిర్మల్ మీదుగా ప్రైవేట్ బస్ హైదరాబాద్ వెళ్తుంది. అదే సమయంలో హైదరాబాద్ నుంచి నిర్మల్ వైపు వస్తున్న కంటైనర్ బస్సును వెనుక భాగంలో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు గాయాలు కాగా చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఐదు ఆధార్ సెంటర్లపై వేటు

- తప్పుడు పత్రాలను జతచేసిన ఫలితం



కలెక్టరేట్‌లో మూసి ఉన్న ఆధార్ సెంటర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాలోని ఐదు ఆధార్ కేంద్రాలపై యూనిక్ ఐడేంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) వేటు వేసింది. ఆ కేంద్రాల ద్వారా అందించే సేవలను నిలిపివేస్తూ నిర్వాహకుల ఆథరైజేషన్‌ను సస్పెండ్ చేసింది. దీంతో ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఐదు కేంద్రాల నిర్వాహకులు ఆధార్ సంబంధిత సేవలందించేందుకు దూరమవాల్సిన దుస్థితి నెలకొంది. అడ్రస్ మార్పునకు సంబంధించి తప్పుడు వివరాలతో కూడిన ధృవీకరణ పత్రాలను జత చేసినందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ చర్యల ద్వారా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ కార్యాలయం, భుక్తాపూర్‌లోని సెంటర్‌తో పాటు, తలమడుగు, బేల, ఇంద్రవెల్లి మండల కేంద్రాల్లోని ఆధార్ కేంద్రాలపై వేటు పడింది. ఇందులో ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఆధార్ సెంటర్‌ను ఇది వరకే సస్పెన్షన్ వేటు వేయగా తాజాగా మిగతా సెంటర్లపై చర్యలు చేపట్టింది. ఆధార్ సంస్థ చేపట్టిన చర్యల విషయం తెలియకపోవడంతో నిత్యం ఆధార్ సంబంధిత సేవల కోసం వస్తున్న ప్రజలు ఆ సెంటర్లు మూసి ఉండటంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. కేంద్రాలపై చర్యలు చేపట్టిన విషయాన్ని ప్రజలకు సమాచారమందించాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది.

ఏమరుపాటుగా ఉంటే వేటు తప్పదు...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ, అభివృద్ధి పథకాలు పొందాలన్నా, పోటీ పరీక్షలు, విద్య, ఉద్యోగాలకు దరఖాస్తు చేయాలన్నా ప్రభుత్వాలు ఆధార్ కార్డును తప్పనిసరి చేశాయి. అంతటి కీలకమైన ఆధార్ కార్డుల జారీలో తప్పుడు సమాచారం పొందుపరిచినట్లు తేలితే ఆధార్ సేవ కేంద్రాలనే బాధ్యులను చేస్తూ ఆధార్ సంస్థ వారిపై చర్యలు చేపడుతోంది.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

దస్తురాబాద్: మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి జైలు శిక్ష విధిస్తూ శనివారం ఖానాపూర్ సివిల్ జడ్జి జితిన్ కుమార్ తీర్పు ఇచ్చారని ఎస్సై ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే... మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఖానాపూర్, జన్నారం మండలంలోని రేవోజీపేట గ్రామానికి చెందిన వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. వారిపై కేసు నమోదు చేసి ఖానాపూర్ కోర్టుకు తరలించారు. ముగ్గురికి మూడు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ ఖానాపూర్ సివిల్ జడ్జి జితిన్‌కుమార్ తీర్పును వెల్లడించారు. అలాగే మరో 9మందికి రూ. 2వేల జరిమానా విధించారు.

మట్కా నిందితుల అరెస్ట్

కైలాస్‌నగర్: పట్టణంలోని సంజయ్‌నగర్‌లో మట్కా నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడిచేసి ఇద్దరిని పట్టుకు న్నారు. సీసీఎస్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ జె.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో దాడిచేసి ఇద్దరిని పట్టుకున్నారు. ఒకరు పరారీలో ఉన్నారు. వీరి వద్ద నుంచి రూ.7240 నగదు, మట్కా చిట్టీలు స్వాధీనం చేసుకున్నారు.

గుడుంబా పట్టివేత

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కూర్తి పంచాయతీ పరిధిలోని చింతల్‌పేట్‌కు చెందిన జి.శేఖర్ గుడుంబా విక్రయిస్తుండగా పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాయబారపు రవి తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మంజుల వద్ద ముందస్తుగా బైండోవర్ చేశామని పేర్కొన్నారు. గుడుంబా విక్రయిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. సిబ్బంది రశీద్, ప్రకాశ్, గౌతం, కల్పన ఉన్నారు.

దాడి చేసిన ఒకరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: దాడికి పాల్పడిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్ శనివారం తెలిపారు. వివరాల ప్రకారం.. పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన చింతకుంట్ల సాయికుమార్‌పై అదే కాలనీకి చెందిన సంతోష్ దాడికి పాల్పడ్డాడు. పట్టణంలోని విద్యుత్ తరంగిణి ఫంక్షన్‌హాల్‌లో వీరిద్దరూ వంట చేస్తున్న సమయంలో సాయికుమార్ ఆకుల సంతోష్‌ను అంబర్ ఎందుకు తింటున్నావని మందలించాడు. ఆగ్రహించిన సంతోష్ సాయికుమార్‌పై దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లుగా పేర్కొన్నారు.

నాణ్యతతో కూడిన విద్య బోధించాలి



మాట్లాడుతున్న పీవో చాహత్ బాచ్‌పాయ్



శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

ఉట్నూర్‌రూరల్: ఆశ్రమ వసతి గృహాల్లో, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను అందించాలని ఐటీడీఏ పీవో చాహత్ బాచ్‌పాయ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కొమురంభీం కాంప్లెక్స్ పీఎంఆర్‌సీ మీటింగ్ హాల్‌లో 38 ఆశ్రమ, గురుకుల పాఠశాలల నుంచి వచ్చిన ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, ఐసీటీ బోధకులు, గణితశాస్త్ర ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన ఒక రోజు శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీర్, పీజీ వారి సౌజన్యంతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా ఐటీడీఏ ఉట్నూర్ కేంద్రంగా ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాలోని 34 ఆశ్రమ పాఠశాల ల్లోని నాలుగు గురుకుల పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో కంప్యూటర్ విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతీ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్, ఫర్నీచర్ తదితర సౌకర్యాలను కల్పిస్తూ పిలలకు కంప్యూటర్ సైన్స్, కోడింగ్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అంశాల్లో బోధన చేస్తూ గణితం, ఇంగ్లిష్, తెలుగు విషయాలను అనుసంధానం చేస్తూ నేటి సమాజ పోకడలకు అనుగుణంగా విద్యార్థులను తయారు చేయడమే లక్ష్యంగా అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీర్ సంస్థ కృషి చేస్తోందని తెలిపారు. సంస్థ మేనేజర్ వికాస్‌కుమార్, ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్, ఆర్‌సీవో గంగాధర్, మంచిర్యాల్ డీటీడీవో నిలిమ, నిర్మల్ డీటీడీవో అంబాజీ ఉన్నారు.

కడెం ప్రాజెక్ట్‌కు ఏడేళ్లకు మళ్లీ రంగు



ప్రాజెక్ట్‌కు కలర్లు వేస్తున్న సిబ్బంది

కడెం: కడెం ప్రాజెక్ట్ కు రంగులు వెలిసిపోయి గోడలు మ సకబారిపోయాయి. ఎట్టకేలకు అధికారులు స్పందించి శని వారం నుంచి కల ర్స్ వేయిస్తున్నారు. 2006లో ఈ ప్రాజెక్ట్‌కు రంగులు వేశా రు. 17ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు రంగులను వేయిస్తున్నారు. మొదటగా వైట్ ప్రైమర్ వేసి అపై కలర్స్ వేయనున్నట్లు తెలిపారు. రెండు టవర్ బిల్డింగ్‌లకు జాతీయ పతాకంలోని మూడు రంగులను వేయించాలని అధికారులు అనుకుంటున్నారు.

రిమ్స్‌లో జారిపడిన కార్మికుడికి గాయాలు



పరీక్షిస్తున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రిమ్స్‌లో విధి నిర్వహణలోని ఓ కార్మికుడు మొదటి అంతస్తులోని సజ్జ నుంచి శనివారం ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రగాయాల పాలయ్యాడు. కాంట్రాక్ట్ ప్రతిపాదికన పారిశుద్య కార్మికుడిగా పనిచేస్తున్న గంగన్న విధుల్లో భాగంగా మొదటి అంతస్తులోని సజ్జపై ఉన్న చెత్తను శుభ్రపరుస్తున్నాడు. ఈ క్రమంలో సజ్జపై ఉన్న పాకురు కారణంగా కాలు జారీ కింద పడిపోయాడు. దీన్ని గమనించిన కార్మికులు వెంటనే రిమ్స్‌లోని అత్యవసర వార్డుకు తరలించి వైద్యులకు సమాచారమందించారు. ఈ విషయం తెలుసుకున్న రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్, సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌లు చికిత్స పొందుతున్న కార్మికుడిని పరామర్శించారు. వారు కూడా కార్మికుడిని పరీక్షించారు. అయితే సంబంధిత కాంట్రాక్టర్ కార్మికులకు సరైన సౌకర్యాలు కల్పించని కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని తోటి కార్మికులు ఆరోపిస్తున్నారు. కాగా కార్మికుడు గంగన్న మాట్లాడుతూ సజ్జపై అన్నం, చెత్త పేరుకుపోవడంతో దాన్ని శుభ్రం చేయడానికి పైకి ఎక్కినట్లు తెలిపారు. కాలుజారి కిందపడినట్లుగా వెల్లడించారు.